
చిత్రాలు: నర్సిం



“ఆదేమిటీ వచ్చినవారు వచ్చినట్టే వెనక్కి తిరిగారు.'' ఇంటికొచ్చిన చుట్టాన్ని మెట్ల మీద చూసి ఆశ్చర్యంగా అడిగారు వరంధామయ్యగారు.

''ఇంట్లో ఎవరూ ఉండకుండా ఉండరే! ఇక పిల్లలు స్కూలు నుంచి తిరిగి వచ్చే వేళ కూడా. రండి'' అంటూ ఆయన్ని దిగిన వది మెట్లూ మళ్ళీ పైకెక్కించారు.

“తలుపు తట్టా. కాలింగ్ బెల్ పాడైనట్టుంది. ఎవరూ చూసినట్టు లేదు... పోనీ ఇంకోసారి వస్తాగా'' అంటూ వరంధామయ్యని అనుసరించాడా పెద్దమనిషి.

తలుపు దగ్గిర ఆగిన వరంధామయ్య గారి ముఖం ఆ క్షణంలో నీటి చుక్క వడితే చాలు చిటపట లాడ్డానికి సిద్ధంగా ఉన్న కాలిన పెనంలాగా ఉంది.

''నా ముఖం. అది కొంపలోనే ఉంటుందండీ. ఈ టైముకి ముందు - గదిలో ఉండమని ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోదు. కాస్తీమధ్య వినికిడి కూడా మందగిస్తూంది లెండి'' అంటూ తలుపు బాదారు.

అప్పుడే తలుపు తీయడానికి వస్తూన్న పద్మావతి మొగుడి మాట విని నిలబడిపోయింది. క్షణం సేపు 'సజీవ పదార్థాన్ని ఇలా 'అది' ఎప్పుడయ్యాను చెప్మా' అని వింత పడింది. చెదరిన మనసు కూడతీసుకుని బాదుతున్న తలుపు త్వరగా తెరచింది.

“ఈ నాలుగిళ్ళ భవంతిలో ఏ మూల అఘోరించావు! చూడు వచ్చిన పెద్దమనిషి కాస్తా చక్కాపోతూంటే వెనక్కి తీసుకొచ్చాను. కోడలు రాలేదా ఇంకా? రండి కూర్చుందురు గాని'' అంటూ వచ్చినాయనని ఆహ్వానించి కూర్చోపెట్టారు వరంధామయ్య. ''కూర్చోండి కాస్త ముఖం కడుక్కు వస్తాను. ఈ టైములో బస్సెక్కి రావడమంత కష్టం ఇంకోటి ఉందనుకోను'' అంటూ కూర్చోపెట్టిన పెద్దమనిషి ముందా రోజు పేవరు తోసి లోపలికి నడిచారు.

అప్పటికే పద్మావతి వెనుక ఉన్న చిన్న వరండాలో చేస్తూ ఆపిన పని తిరిగి అందుకోబోతోంది. భర్త కంఠం విని తలెత్తింది.

''నీ కెన్నిసార్లు చెప్పింది కోడలు సాయంత్రం పూట కాస్త ముందు గదిలో ఏడవమని? కోడలు చుట్టం. వెళ్ళిపోయి ఉంటే... ఈ పూటకిక — ఏం రగడ జరిగేదో. అయినా, నీకింక బుద్ధి రాదే. పూర్తిగా మందబుద్ధివైపోయావు. అనలేవిషయం మీదా శ్రద్ధ లేదు. కాస్త కాఫీనీళ్ళు కలిపి చావు'' అంటూ బాత్‌రూంలోకి నడిచారు.

అదో రెండు పడకల ఫ్లాట్. మూడో అంతస్తులో ఉంది. నాలుగంతస్తులు దాటితే లిఫ్ట్ ఉండునేమో — కానీ మూడేగా. అంచేత చచ్చినట్లు అన్ని మెట్లూ ఎక్కి దిగవలసింది. స్థలం కలిసిరాడానికో ఏమో మహా దారుణంగా ఇరికించారు మెట్లని. ఆ ఫ్లాట్‌లో ఒకరితో ఒకరు గట్టిగా కూడా మాట్లాడక్కర లేదు. అందరి మాటలూ అందరికీ వినిపిస్తాయి. భర్త మాట ముందు గదిలో కూర్చున్న పెద్దమనిషి చెవిన పడి ఉంటుంది అనుకుంది పద్మావతి. ఏమనుకుంటాడా పెద్దమనిషి. ఈ ఇంట్లో తనకెంత గౌరవముందో గ్రహించి నొచ్చుకుంటాడా? తానూ లోకువగా మాట్లాడతాడా! ఏమో... 'మొగుడు కొడితే మాదోకోళం వాడు కొట్టాడని సామెత...' నిట్టూర్చి భర్త బయటపడే లోపల కాఫీ కలిపి సిద్ధం చేసింది. ''పట్టుకెళ్ళి ఇవ్వు. అదీ చెప్పాలా?'' కసరుకుంటూ ముందుగదిలోకి నడిచారు వరంధామయ్య.

కాఫీలు అందించి లోపలికి చక్కాపోయింది పద్మావతి. ఆమెకి భర్త చాలా కొత్తమనిషిలాగా కనిపించాడు. 'ఎందుకంత విసుగు? కోపం? లోకువ' అనుకుంటూ అప్పటిదాకా తరిగిన కూరలు చిన్న చిన్న ప్లాస్టిక్ డబ్బాలలోకి ఎత్తి గట్టిగా మూతలు పెట్టింది. అలా సిద్ధం చేయకపోతే కోడలికి విసుగు. పొద్దుటే ఏం కావాలంటే అది రెడీగా ఉండాలి. అంతా కలిసి తొమ్మిది గంటలలోగా బయటికి వెళ్ళిపోతారు... అప్పుడసలు పని ప్రారంభించి ముగించే ప్రయత్నాలు చేయడం పద్మావతికి అలవాటైపోయింది. రెండు పడకగదులూ తడిబట్ట పెట్టి తుడుస్తుంది. లేకుంటే శుభ్రంగా ఉండవు. దుప్పట్లు, తువ్వాళ్ళు, అందరి బట్టలు త్వరగా ఉతికి పైడాబా మీద ఆరవేసి వచ్చి స్నానం చేసి దీపం పెట్టుకునేది కొన్నాళ్ళ కిందటిదాకా. కానీ, పద్మావతికి ఇప్పుడు దేవుడికి దీపం పెట్టాలనిపించడంలేదు. స్నానం చేసి తినాలనిపిస్తే కాస్త తిని గిన్నెలు కడిగేస్తుంది. అన్నీ తుడిచిపెడుతుంది. ''నీళ్ళ చుక్కలు ఆరితే గిన్నెలు అసహ్యంగా ఉంటాయి. ఆదివారంపూటేనా ఎవరేనా వస్తే ఏమనుకుంటారండీ'' అంటూ సాగ తీస్తుంది కోడలు. ఆమెకెలాగా తీరదు. వారం

**కొడుకు, భర్త, అనీ అననట్టు కోడలు – 'అది', 'ఇది' అన్నప్పుడల్లా మనసు చివుక్కుమంటూనే ఉంటుంది పద్మావతికి.**

# అదెక్కడ?



మనిషి అనే పదానికి పురుషుడే పర్యాయ పదం అనే భావన స్థిరపడిపోయింది. స్త్రీత్వం స్త్రీని మనిషి కాకుండా కాపాడు కొస్తోంది. అమ్మతనం, అమ్మమ్మతనాల ముసుగులో స్త్రీకి జరుగుతున్న అందమైన వంచనను బట్టబయలుచేసిన కథ.

పొద్దుగునా ఆఫీసు. ఒక్క ఆదివారం కదా విశ్రాంతి. ఆ రోజుకి పిల్లల యూనిఫారాలే కాదు, పెద్దల బట్టలకీ ఇస్త్రీ పెట్టి ఉండాలి. లేకుంటే ఇబ్బంది — వారమంతా! "చిన్న ఇల్లు. చిన్న కుటుంబం — రోజంతా ఎవరూ ఉండనే ఉండరు... దీనికో లాండ్రీ — పనిమనిషి ఎందుకు? కాస్త రాసేస్తే గిన్నెలు, కాస్త గుమికేస్తే గుడ్డలు అయిపోయె." కోడలు ఎప్పుడూ పక్క ఫ్లాట్ కోడలితో అంటూనే ఉంటుంది - కష్టంగా ఉందని ఎవరంటారు?!

గోల చేసుకుంటూ పిల్లలు చక్కా వచ్చారు. పద్మావతిలో కాస్త చలనం వేగం పుంజుకుంది.

"నానమ్మా! తిండానికి" అంటూ విరుచుకుపడ్డారిద్దరూ.

"యూనిఫారాలివ్వండి. మాస్ విప్పండి. ముఖాలు కడగండి. బట్టలు మార్చుకు రండి." వరుసగా చెప్తూ వాళ్ళకింత బ్రెడ్డు, వెన్న జామ్ రాసి సిద్ధం చేసింది.

"నానమ్మా రోజూ ఇదేనా? దోసె వెయ్యి." మనుమడు అడిగాడు. "నాకు వద్దు. ఇదే కావాలి." మనుమరాలు నొక్కి వక్కాణించింది. ఈడ్చి తంతే దానికి పదేళ్ళు లేవు. అది తన అవసరాలు స్పష్టంగా తెలియచెప్పనూ కలదు, తీర్చుకోనూ కలదు.

"ఒక్క ఆదివారం అలాంటి టిఫిన్స్. అమ్మ చెప్పింది కదా!" మనుమణ్ణి ఒప్పించి తినమంది పద్మావతి.

"ఆయన వెళ్ళాడుగాని, నాక్కాస్త అటుకులో గట్రో వేయించి ఇవ్వకూడదూ. ఈ రొట్టె తినలేకుండా ఉన్నాను." భార్య ముందు నిలబడుతూ అడిగారు వరంధామయ్య. పద్మావతి మాట్లాడకుండా రొట్టె ప్లేటు అందించింది.

"నే చెప్పింది వినబడలేదా?" కాస్త విసుగ్గా అడిగారు. "వినిపించింది. కానీ, వేపుడు చేస్తే నూనె ఎక్కువ అవుతుంది. కోడలు రావాలన్నానాళ్ళు నూనె రాకపోతే —" ఆగిపోయింది పద్మావతి భర్త ప్లేటు పట్టుకుని చక్కాపోవడంతో...

కోడలు వస్తుందింక. కొడుకూ వస్తాడు. ఒక్కొక్కప్పుడు ఇద్దరూ కలిసి కాస్త ఆలస్యంగా వస్తారు. పిల్లలిట్టే గ్రహించి 'సినిమాకెళ్ళారు. మమ్మల్నెప్పుడు తీసుకెడతారు?' అంటూ గోల మొదలుపెడతారు.

అప్పుడేదో సముదాయించి చెప్పేసినా, భర్తతో కబుర్లు చెప్తూ, "మీ అమ్మగారి మహిమ! ఆవిడ చెప్పకపోతే - వాళ్ళకెలా తోస్తుందండీ పనివెధవలు!" సన్నగా సన్నాయినొక్కులు ప్రారంభిస్తుంది... అలాంటి రోజు... చినికి చినికి గాలివానలాగా వాతావరణం మారిపోయి — వెనుక ఉన్న పని వరండాలో కూర్చున్న పద్మావతి మీదికి మళ్ళుతుంది తుపాను.

"నీ కెన్నిసార్లు చెప్పినా తెలియదేమిటే అమ్మా... పిల్లలకెందుకు నూరిపోస్తావు?"

పద్మావతి ఏదో చెప్పేలోపలే భర్త అందుకుని — "దాని బుద్ధి అలాంటిదిరా! కూర్చుని తింటూంది కదా - కాలక్షేపం లేక! వెధవవాగుడూ అది... ఛ.ఛ. వయసు రాగానే సరా... ఊరుకోరా, పక్క ఫ్లాట్లవాళ్ళు గోడలకి చెవులు అంటించేశారప్పుడే..." అని కొడుకుని ఓదారుస్తాడు. వాతావరణం మరుక్షణంలో మారిపోయి — కొంపలో ఎవరో చచ్చినంత నిశ్శబ్దం ఆవరించిపోతుంది. రోజూ జరిగేవే అయినా పద్మావతికి రోజూ ఆశ్చర్యంగానే ఉంటుంది - ఎప్పుడిలా జడపదార్థంగా మారిపోయానా అని. ఎప్పుడూ ఏ పని చేస్తున్నా ఆ ప్రశ్న ఆమెని వెంటాడుతూనే ఉంటుంది.

కలలు కనే వయసయింది. కని పెంచే వయసయింది. బాధ్యతలు తీరిన వయసయింది. 'నాకొక్కర్తికేనా? ఆయనకీ అయిందిగా. మరి నేనే ఎందుకిలా మారిపోయాను? ఎవరైనా మార్చేశారా, నేనే మారిపోయానా?' కొన్ని వందల, వేలసార్లు ఆ ప్రశ్నలు వేసుకుని ఉంటుంది పద్మావతి.

కొడుకు, భర్త, అనీ అననట్టు కోడలు — 'అది', 'ఇది' అన్నప్పుడల్లా మనసు చివుక్కుమంటూనే ఉంటుంది పద్మావతికి. భర్తని నిలదీసి అడగాలని ఉంటుంది. కొడుకుని నిలదీసి అడగాలని ఉంటుంది. కానీ, అడిగే ధైర్యం ఎక్కడికి పోయిందో ఆమెకెప్పుడూ అంతుపట్ట లేదు... రోజులూ, నెలలూ, సంవత్సరాలూ గడిచిపోతున్నాయి. కానీ, పద్మావతి గూడుకట్టి మనసులోని ప్రశ్నలు దాచేసింది దాంట్లో. అవి అక్కడికక్కడే గింగిరాలు తిరుగుతూ కొట్టుమిట్టాడుతూ ఉంటాయి. దీన్నిమటుకు అపలేకపోయింది.....


'పద్దూ... నా పద్దూ' అంటూ పెళ్ళయిన కొత్తలో తిరిగిన భర్త, అంచెలంచెలుగా ఎదిగి ఆఫీసరయ్యే నాటికి కొడుకు చేతికందొచ్చాడు. ఒక్కగానొక్క కొడుకు. ఏరికోరి ఓ పిల్లని చేశారు. చిలకాగోరింకలు. చూడముచ్చటయిన జంట. జోడుగా ఉద్యోగాలకి పోతూ, సంసారంలో కూడా ఇద్దరు పిల్లలతో ప్రోగ్రెస్ సాధించారు. 'అత్తయ్యా ఉండబట్టిగాని లేకుంటే కుదిరేదా' అనుకుంటూనే పిల్లల పెంపకం అత్తగారిపై ధైర్యంగా పెట్టి ఉద్యోగం కానిచ్చింది కోడలు. "అత్తయ్యా ఉన్నారు కనుక గాని, పనివాళ్ళ మీద ఎలా వదిలి పెడతాం పిల్లల్ని" అంటూ ఆదివారంపూట విందుకొచ్చిన స్నేహితులతో చాలా గర్వంగా చెప్తుంటుందిప్పటికీ.

భర్త రిటైరైన రోజు నుంచి ఎందుకో ఇంటి వాతావరణంలో కాస్త కాస్త మార్పు రావడం గ్రహించింది పద్మావతి. అడక్కుండా స్వతంత్రించి ఏ పనీ చేయలేకపోతూంది. "ఖర్చులు తగ్గించుకోవాలండీ. మామయ్యగారు రిటైరయ్యాక పిల్లల చదువులకీ - ఖర్చులు పెరిగిపోతున్నాయి" అంటూ ఇంటి పెత్తనం మీద వేసుకుంది కోడలు. పద్మావతికిదేం కష్టం అనిపించలేదు సరికదా బాధ్యత తన మీద లేనందుకు కాస్త సంతోషపడింది కూడా.

ఈ ఫ్లాట్ కొన్నారు. భర్త డబ్బు చాలామటుకు దీంట్లో కూరుకు పోయింది... చేతిలో డబ్బాడక, కొడుకుని అడగలేక - మళ్ళా ఉద్యోగం వెతికి సంపాదించి రాజాలాగా చేరిపోయారాయన. పద్మావతి మటుకు ఊబిలో కూరుకుపోయినట్టు కొంపలో కూరుకుపోయింది. ఫ్లాట్‌లో ఓ గదిలో కొడుకు, కోడలు. రెండోది మనుమలు, తాతగారు. ఇక పద్మావతికి వంటిల్లు లేకుంటే చిన్న వసారా. 'ఎక్కడ పడుకుంటే ఏమిటి? ఇట్టే తెల్లారిపోతుంది' అని సర్దుకుపోవడం కూడా బాగా అలవాటైపోయింది. అలవాటవనంటున్నది ఒక్కటే - మనసులో బాధ. అది ఎంత నొక్కిపెట్టినా... తలెత్తుతూనే ఉంది. 'ఇన్ని సర్దుకుపోతున్నా కదా - ఈ పిలుపు, పలకరింపు, కసరు, హెచ్చరిక... ఇవెందుకు సర్దుకు పోలేకపోతోందో ఆమెకే అర్థంకావడం లేదు.

'మనిషన్నాక కొన్ని లక్షణాలు మిగిలి ఉండాలి. అలాంటి లక్షణమేనేమో ఇది' అనుకుంటూ ఉంటుంది అప్పుడప్పుడు. "ముసల్దానికి ఒంట్లో బాగులేదా, లేచినట్టు లేదు." ఓ రోజు కొడుకుని అడుగుతున్న భర్త మాట విని ఒక్క ఉదుటున లేచి కూర్చుంది పద్మావతి.

అసలీయన్ని సంబంధం చూసినప్పుడు - 'వయసు తేడా ఎక్కువ. వద్దుకాక వద్దని



కొడుకును, భర్తను నిలదీసి అడగాలని ఉంటుంది. కానీ...

కూర్చుంది పద్మావతి తల్లి. "మంచి ఉద్యోగం. ఒక్కడే కొడుకు. సుఖపడుతుంది. వయసుదేముంది? ఆపితే ఆగేదేం కాదు కదా" అంటూ అమ్మని బలవంతం చేసి ఈ సంబంధానికి ఒప్పించడం పద్మావతికి జ్ఞాపకం వచ్చి నవ్వొచ్చింది. 'నేను ముసల్దాన్నయితే ఆయన?' అనుకుంది... కానీ, చిత్రం.... ముట్లుడిగి, పిల్లల పెళ్ళిళ్ళయితే చాలు... ఆడది ముసల్దయి కూర్చుంటుంది. బహుశా అక్కడే ప్రారంభమవుతుందేమో ఆమె జడత్వం కూడా. భర్తకక్కరలేదు. పిల్లలకక్కరలేదు.. అవసరం లేని వ్యక్తి.. కాళ్ళకడ్డు... కానీ, ఏం చేస్తారు? భరిస్తారు.

పద్మావతి మనసు కొద్ది రోజులుగా చాలా తీవ్రంగా ఆలోచిస్తోంది... ప్రత్యేకించి 'దీన్ని' గురించి అని కాదు.... తనలాంటి ఆడాళ్ళు ఇంకా ఉంటారా? తనలా లోలోన కుమిలిపోతూ చావు కోసం ఎదురుచూస్తూ ఉంటారా? అని...

ఇరుగు పొరుగులని ఎప్పుడోగానీ చూడదు. పైకి నీళ్ళు రాకపోతే బిందెలు కిందికి తేవడం, నీళ్ళు నింపి ఒక్కొక్కటిగా పైకి అందిస్తే మూడో అంతస్తు రెండు మెట్లు దిగి కోడలు అందుకుని శ్రమ తగ్గిస్తుంది! పక్కింటి కుర్రాడోరోజు "ఆంటీ మీరా మెట్లన్నీ బిందె పట్టుకు ఎక్కి, అలా పైమెట్ల మీద బామ్మగారిని నిలుచుని అందుకోమనాలి" అని సూచించాడు.

ఆ మాటకి 'బోడి సలహా'లని తిట్టిపోసుకుంది.

పిల్లలకి రిక్షా రాకపోతే స్కూలుకి తీసుకెళ్ళి తీసుకు వచ్చేటప్పుడు ఒకరిద్దరు తనలాంటి వాళ్ళు ఎదురైనా, తాతగార్లు కూడా మనుమలని నడిపించుకు వెళ్ళడం కనిపించింది. 'కని, పెంచి పిల్లల్ని పెద్ద చేయడమే ఓ పెద్ద పని. జీవితంలో చాలాభాగం తినేస్తుంది. వయసు పైన పడ్డాక... మళ్ళీ చిన్నపిల్లల వెంట పరుగులు తీయడం అంత తేలిక పని కాదే. ఎందుకు తోచదో... మనుమలు. సరదాగా వాళ్ళతో గడపడం, వాళ్ళ పనులు చేయడంలో ఎంతో తృప్తి ఉండాలి... కానీ, అదేం కనబడడం లేదెందుకో...' పద్మావతికి తన మీద నమ్మకం పోతోందా అనిపించింది. 'అమ్మతనం, నానమ్మతనం, అమ్మమ్మతనం ఆనందమే కానీ, నేనూ మనిషినని వాళ్ళూ అనుకున్నప్పుడు ఆనందం. లేకుంటే ఎక్కడి నుంచి వస్తుంది. ఏమిటో పిల్లలకి చేయడం కూడా విసుగైతే ఎలా', అనుకుంటుందేమో కోడలు... ఎలా చెప్పడం ఓపిక లేదని - ఎందుకు తెలియదు వాళ్ళకి నాకు ఓపిక లేదని? ప్రశ్నించుకుంటూ ఆదివారానికి ఇడ్లీ పప్పు రుబ్బుతోంది పద్మావతి. అంతా ముందు గదిలో కూర్చుని టీవీలో మునిగి తేలుతున్నారు. 'ఎవరూ నన్ను తల్చుకోవద్దు. కనీసం బతికున్నందుకు భర్తయినా తలుచుకోవద్దా' అన్న ఆలోచన రాగానే పద్మావతి పిండి రుబ్బడం ఆపి గోడకి జేరబడి కూర్చుంది. ఆమె పరిపరివిధాలా ఆలోచించింది. ఉన్నపళంగా లేచి చేయి కడుక్కుని ఓ జత మారు బట్టలు సంచీలో పెట్టుకొని బయటికి నడిస్తే వీళ్ళు గమనిస్తారా? అనుమానం వచ్చింది... లేచి చేతులు, ముఖం కడుక్కుంది. తల కాస్త కూడదీసుకుంది. ఆరుతున్న చీరా జాకెట్టూ తీసి చిన్న గుడ్డ సంచీలో పెట్టుకుంది... మెల్లిగా ముందు గదిలోకి వచ్చింది. సినిమా కబోలు_ అంతా మునిగి తేలుతున్నారు. మెల్లిగా తలుపుకేసి నడిచింది. తెరిచి బయటికి అడుగు పెట్టింది. మెట్లు దిగుతూ అనుకుంది - 'ఎక్కడి కెళ్ళాననుకుంటారు? వెతుక్కుంటారా?...' గుడ్డిగా రోడ్డు ఎక్కి ఓ వారంట నడవడం ప్రారంభించింది పద్మావతి.





చల్లగాలి ముఖానికి తగిలి ప్రాణం లేచి వచ్చింది. 'నేను మనిషినే. ఇంకా స్పర్శజ్ఞానం పోలేదు' అన్న ధైర్యం వచ్చింది.

'నిజంగా జీవచ్ఛవంలా బతకడం అంటే ఇదే... ఇప్పటిదాకా - నే సాగిస్తున్న బతుకు. ఇప్పుడిక... కష్టపడినా జీవం ఉన్నట్టు బతకడానికి ప్రయత్నిస్తాను' అనుకుంటూ కొత్త ధైర్యంతో గబగబ నడవడం ప్రారంభించింది. గమ్యం లేని ప్రయాణమే అయినా, చాలా గర్వంగా ఉంది పద్మావతికి.

"ఏ కరివేపాకు కొనడానికో బయలు దేరిపోయింది చూశావా. ఇంకా రాలేదు... ఎప్పుడొచ్చి ఉడకేస్తుంది? ఇక ఎప్పుడు మనకి పెడుతుంది?" ఈపాటికి విసుక్కుంటూ ఉంటుంది కోడలు.

"అదంతేనమ్మా. అనలు బుర్ర పనిచేయదు..." భర్త వంతపాడతారు.

నవ్వుకుంటూ నడుస్తున్న ఆమెతో అడుగు కలుపుతూ ఇద్దరు ముగ్గురాడాళ్ళు నడవడం గమనించి పలకరింపుగా నవ్వింది పద్మావతి.

"కొత్తగా చేరావా ఇటు వైపు పనిలో?" ఒకామె మాట కలపడానికి అన్నట్టు అడిగింది.

ఒక్క క్షణం పాటు సంశయించింది పద్మావతి.

"ఇంటిలో ఉండి చేస్తున్నాను. అసలు సెలవుండడం లేదు" అంది నెమ్మదిగా.

"రెక్కల కష్టం మీద బతికే మనలాంటి వాళ్ళ కోసం ఓ వసతి ఏర్పడింది. తెలియదా. మేం ఓ పదిమందిమి అక్కడే ఉంటాం. ఉదయాన్న పనికి వచ్చి - ఇదిగో ఇలా తిరిగి వెడతాం. నువ్వేటు?"

"ఇంకా తేల్చుకోలేదు." కాస్త జంకుతూ అంది.

"ఈ పూటకెటని? ఆ పని వదిలేశావుగా."

"అదే..."

**"ఇక్కడ నేనో మనిషిని. ఇక్కడ నేను జీవచ్ఛవాన్ని కాదు. ఇక్కడ నన్నెవరూ 'అది' అనరు."**

"సరి సరి. మాతో రా. మా అమ్మగారేం అనరు. రేపావిడే ఏదో పని చూసి పెడతారులే. వారంలో ఓ పూటైనా విడుదల లేకుంటే ఎలా? మనం ప్రాణం లేని కీలుబొమ్మలమా?" ధైర్యం చెప్పింది వారిలో కాస్త పెద్దది.

గట్టిగా నిట్టూర్చి వారితో అడుగు కలిపింది పద్మావతి.

"వంటపనా? పై పనా? లేకుంటే ఆస్పత్రిలో ఆయా పనిలాంటిది కూడా దొరుకుతుంది. పని చేసుకునే వాళ్ళకి భయం అక్కరలేదు. ఇంతకీ నీ పేరేమిటి? కనీసం ఈ నెల జీతం మొత్తం ఇచ్చారా?"

"లేదు. అడగలేదు." సగం స్వగతంగా అంది పద్మావతి.

"పోనీలే. నువ్వేం భయపడకు... పద...!" అంటూ ఇల్లు దగ్గిర పడుతుంటే పుంజుకుంటున్న వేగంతో నడవడం ప్రారంభించారు అంతా.

వారిననుసరించింది పద్మావతి. ఆమెలో అప్పుడే కొత్త ధైర్యం, కొత్త ఉత్సాహం తలెత్తడం మొదలెట్టాయి.

"అదిగో అదే గేటు. గదికి ముగ్గురం ఉంటాం. ఇబ్బందిగా ఉండదులే. అలవాటైపోతుంది. రేపీపాటికి నువ్వూ మాలాగా పని నుండి తిరిగి వస్తూంటావు." సరదాగా నవ్వుతూ ఒకామె గేటు తెరిచింది.

పద్మావతి ఓసారి చుట్టూ కలయజూసింది. ప్రశాంతంగా ఉంది.

"ఇక్కడ నేనో మనిషిని. ఇక్కడ నేను జీవచ్ఛవాన్ని కాదు. ఇక్కడ నన్నెవరూ 'అది' అనరు. నా కంత కంటే ఏం అక్కరలేదు. మనిషిన్నేను..."

లోపలికి నడుస్తూన్న పద్మావతి పెదవుల మీద సన్నని నవ్వు వెలిగింది... అది ఇంటి వాళ్ళని తలుచుకుని కాదు. ఈ ధైర్యం ముందే ఎందుకు చేయలేకపోయానని!

'ఈసరికి అదెక్కడ చచ్చిందో... ఎక్కడికెడితే అక్కడే పాతుకుపోతుంది అంటూ అలంగం తిరగేస్తుంటారాయన' అనుకుంటూ మెట్లెక్కి పక్కగా ఉన్న ఆఫీసు గదిలోకి ఒకామె వెంట నడిచింది పద్మావతి. ■